
## ఈ వారం కథ

కథా నిలయం




# అపస్వరం

**పీ**జీ చేసిన నేను మున్సిపాలిటీలో శానిటరీ ఇన్స్పెక్టర్‌గా చేరక తప్పలేదు. అసలే ఉద్యోగాలు దొరకని కాలంలో ఏదైతేనేమని సరిపెట్టుకోవలసి వచ్చింది.

పోయిపోయి ఇలాంటి ఉద్యోగమా చేసేది? అంటూ నా బంధువులు, స్నేహితులు నన్ను ఎగతాళి చేసి ఆట పట్టించారు.

నవ్వినా నాపచేనే పండుతుందనే సామెత నాకు గుర్తుకొచ్చింది. నా మీద నాకు ప్రగాఢమైన విశ్వాసం! నాలో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ఎక్కువ.

ఉద్యోగంలో చేరి ఏడాదైనా కాలేదు.. పెళ్ళి పెళ్లంటూ అమ్మానాన్న వెంట పడ్డారు. సతాయించారు. కళ్లనీళ్లు పెట్టుకున్నారు. నేను ససేమిరా ఒప్పుకోలేదు.

నా తర్వాత పెళ్ళికి ఎదిగిన చెల్లెలుంది. ముందు దాని భవిష్యత్తు గురించి ఆలోచించండి అంటూ తప్పుకున్నాను.

నా దృష్టిలో పెళ్ళే జీవితం కాదు. జీవితంలో అదొక ఘట్టం మాత్రమే. ఎందరు అవివాహితులుగా ఉండటం లేదు.

పెళ్లనేది ఒక జంజాటం! పిల్లా పీచు... సంసారం బాధ్యతలు... కష్టాలు కడగళ్లు... అన్నీ మోయలేని బరువులే!

నా జీవితాన్ని చక్కదిద్దుకోగల సామర్థ్యం నాకుంది.

డాడీ ఎలిమెంటరీ స్కూలు టీచర్. కటింగ్‌లు పోనూ వెయ్యి రూపాయలు కూడా చేతికి రాదు.

అప్పు చేసి... ప్రైవేట్లు చెప్పి నన్ను చదివించాడు. చెల్లి పెళ్లి చేయటం తన వల్ల కాదని కాళ్లు బారచాపేడు నాన్న.

పులి మీద పుట్రలా... డాడీ అకస్మాత్తుగా రోడ్ యాక్సిడెంట్‌లో చనిపోవటంతో మమ్మీ చెల్లెలి బాధ్యత నాపై పడింది.

బ్యాంకు లోను తీసుకుని చెల్లెలి పెళ్లి చేశాను. అమ్మ ముఖంలో తృప్తిని చూశాను.

వనజ కాపురాని కెళ్ళిపోయాక ఇంట్లో అమ్మ నేను ఇద్దరమే మిగిలాం.

నన్ను పెళ్ళి చేసుకోమని పోరని రోజంటూ లేదు.

'అమ్మా! పెళ్ళికి తొందర పెట్టకు. ఆ విషయం నాకు వదిలెయ్...'

'అంటే... జన్మంతా బ్రహ్మచారిగానే ఉండిపోతావా ఏవిట్రా? నేను కాస్తా కన్ను మూస్తే నీ ఆలనా పాలనా చూచే వారెవరూ ఉండరు...'

'నువ్విట్లా సతాయిస్తే నిన్ను వృద్ధాశ్రమంలో చేర్చి నేను సన్యాసుల్లో కలిసిపోతాను'

నా బెదిరింపు అల్టిమేటమ్‌తో అమ్మ నా పెళ్ళి ప్రస్తావన తేవటం మానేసింది.

* * *

ఇరవైయేళ్ళ సర్వీసులో ఆ ఊరు ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ మీద తిరిగిన వాడినల్లా... డిపార్ట్‌మెంట్ టెస్టులు పాసైన కారణంగా మున్సిపల్ కమిషనర్‌గా సిటీలో పోస్టింగొచ్చింది.

నా అదృష్టం బాగుండి... మొట్టమొదట నేనెక్కడైతే శానిటరీ ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరానో అదే చోటికి కమిషనర్‌గా రిపోర్ట్ చేశాను. అది నా లక్!

అప్పట్లో వున్న రాజయ్య ఇప్పుడు నా బిళ్ల జవాను! నన్ను చూసి గుర్తించి చేతులు జోడించి చిరునవ్వు నవ్వేడు.

'బాగున్నారా బాబూ...' పలకరించాడు రాజయ్య.

రాజయ్య ప్యూననన్న మాటే గాని చాలా మంచి మనిషి. ప్రేమ ఆప్యాయత కల్గిన వ్యక్తి! అతని మంచితనం నేనెరుగుదును.

'నేను బాగానే ఉన్నాను! నువ్వేంటి ముసలాడివైనావ్? తల నెరిసింది. కంఠస్వరం వణుకుతోంది. సీట్లో కూర్చోగానే ఫ్లాస్క్‌లో రాజయ్య తెచ్చిన కాఫీ కప్పులో పోసి అందించగా తాగుతూ పరామర్శించాను.

'రిటైర్మెంట్ మీద పడుతోంది సారూ! వచ్చే ఏడే! తర్వాత ఈ ఆఫీసుతో ఇక్కడి మనుషులతో సంబంధాలు తెగిపోతయ్...' కళ్లు చెమర్చినయ్.

'రాజయ్యా! చింతించకు. జీవితమనే కాలచక్రంలో అన్ని మార్పులు అందరికీ వస్తయ్! అది సహజం...'

'అవును సారూ... మీరు పెళ్ళి చేసుకున్నారా? పిల్లలెంత మంది?' కళ్లు తుడుచుకుంటూ అడిగాడు.

'లేదు రాజయ్యా! బ్రహ్మచారిగానే ఉన్నాను.'

'అదేంటి బాబూ' అదిరి పడి అడిగేడు.

'అదంతేలే! కారణం అడగొద్దు'

'మరిప్పుడు ఇంట్లో తమరొక్కరేనా?'

'వంట మనిషి... పనిమనిషి నాకున్న బంధువులు! వాళ్లే నా ఆలనా పాలనా చూస్తున్నారు...'

'అదేంటి బాబూ ఇంత పని చేశారు' నొచ్చుకున్నాడు రాజయ్య.

'ఒక మనిషి కిచ్చిన మాట కోసం... ఇలా ఉండిపోయానంతే!' కుర్చీలో వెనక్కి వాలిన నా మస్తిష్కంలో పుష్కలంగా పాత జ్ఞాపకాల దొంతరలు నన్ను కలవర పెట్టినయ్.

'అంటే... తమరింకా... ఆనాటి తులసిని మర్చిపోలేదన్న మాట...'

'ఆ విషయం తెలిసిన వాడివి నువ్వొక్కడివవే రాజయ్యా. రెండో కంటికి తెలీకుండా ఆ రహస్యాన్ని కడుపులో పెట్టుకున్నావ్. అవునూ.. తులసి బతికుందా? బాగుందా? ఇంకా ఉద్యోగం చేస్తోందా?' ప్రశ్నల వర్షం కురిపించాడు.

రాజయ్య పెద్దగా నిట్టూర్చాడు.

'ఏం చెప్పను బాబూ! ఆ పిచ్చిది మిమ్మల్నే నమ్ముకుని... మీ మీదే ఆశలు పెంచుకుని.. చావు బతుకుల్లో మంచాన పడి.. ఇంకా మిమ్మల్నే కలవరిస్తూ పిచ్చిదానిలా ఉంది. మీ పుణ్యాన మగబిడ్డకి తల్లి అయింది. కేన్సర్ వ్యాధి దానికి దాపురించింది సారూ...' బావురుమన్నాడు రాజయ్య.

రాజయ్య మాటలు నా హృదయాన్ని శరాఘాతాల్లా తాకేయి. నా చెవులను నేనే నమ్మలేక పోయాను. రాజయ్య మాటలు నమ్మశక్యం కాలేదు.

ఏమిటీ? తులసి మగబిడ్డని కన్నదా? మనసులో సంబరపడుతూ 'రాజయ్యా! నన్నొకసారి తులసి వద్దకు తీసుకుపోవూ? ఎవరి కోసమైతే పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయానో... ఆ మనిషే తనకు శాశ్వతంగా దక్కకుండా పోతోందన్న భయం నన్ను బాధించింది. నన్ను కలవరపరచింది. ఆమె ప్రస్తుత పరిస్థితి నా గుండెను పిండేసినట్లన్పించింది.

'వెళ్దాం బాబూ! రెండు రోజులాగి వెళ్దాం. మీరిక్కడికి కమిషనర్‌గా వచ్చారనే శుభవార్త తులసి చెవిలో వేసి మరీ మిమ్మల్ని వెంటబెట్టుకు పోతాను. ఈ శుభవార్త విని ఆ పిచ్చిది ఎంత సంబర పడుతుందో... మాటల్లో చెప్పలేను...' మితిమీరిన ఆనందం రాజయ్యను ఉక్కిరిబిక్కిరి చేసింది.

తులసి విషయం విన్న క్షణం నుంచి ఆమెని ఎప్పుడెప్పుడు చూడటమాని నా మనసు ఆరాట పడుతోంది.

సరిగ్గా పాతికేళ్ల క్రితం... నేను శానిటరీ ఇన్స్పెక్టర్‌గా జాయినైన కొత్తల్లో... రాజయ్య ఓ ఆడపిల్లని వెంటబెట్టుకొచ్చాడు.

నన్ను సమీపించి 'సారూ! ఈ పిల్ల పేరు తులసి. మా వీధిలోనే ఉంటోంది. దీనమ్మ మనకాడ స్వీపరుద్యోగం చేస్తూ అకస్మాత్తుగా సచ్చిపోతేనూ... దాని కూతురు ఈ పిల్లకి కమిషనర్ బాబు స్వీపరుద్యోగం ఇచ్చి పుణ్యం కట్టుకున్నాడు...' చెప్పాడు రాజయ్య.

ఆ పిల్లని ఆపాదమస్తకం చూశాను. బంగారు బొమ్మలా పొందికగా... అందంగా ముద్దొస్తూ ఉంది.

తులసి పదహారేళ్ళ ప్రాయంలో యవ్వనపు పొంగులతో... చారెడేసి కళ్లతో... కోటేరు లాంటి ముక్కు... నల్లత్రాచులా వేలాడే జడ... లంగా జాకెట్ ఓణీలో...

యస్.వివేకానంద

# ఈ వారం కథ

లేతమలపాకుల్లాంటి పెదాలతో అపరంజి బొమ్మలా... దేవకన్యలా అవుపించింది.

ఆమె అందాన్ని కళ్లతోటే చప్పరించాను. ఇంతటి అందగత్తె... భువనైక సుందరి... స్వీపర్ కూతురంటే నమ్మశక్యంగా లేదు. గంజాయి వనంలో పవిత్రమైన తులసి మొక్కే అన్పించింది.

'వీళ్లూ బాపనోళ్లే సారూ. ఓ పంతులు గారు దీని తల్లిని దగ్గరకు తీసిండు. ఇది కడుపున పడిన తర్వాత కొద్ది రోజులకే ఆయనగోరు... అదే తులసి తండ్రి కాలవ స్నానానికెళ్లి మునిగి సచ్చిపోయిండు. బతుకు గడవక ఈ పసిదాన్ని తీసుకుని దీనమ్మ నాకాడ కొచ్చింది. అన్నా... సాయం చెయ్యవా అంటూ కాళ్లావేళ్లా పడింది. పాపం గదాని పెద్ద సారుకి చెప్పి స్వీపరుద్యోగంలో చేర్పించినా! ఇప్పుడదీ సచ్చిపోయింది. దీన్ని వొంటరిదాన్ని చేసి! గతాన్ని క్లుప్తంగా వివరించాడు రాజయ్య.

తులసి నన్ను చూసి చేతులు జోడించి సిగ్గుపడింది.

తులసి లాంటి పిల్లనే పెళ్ళి చేసుకోవాలన్పించింది ఆ క్షణంలో.

ఇంతటి భువనైక సుందరి... ఇందరి మగమృగాల మధ్య స్వీపర్‌గా బతగ్గలదా? అన్పించింది.

ఈ రాబందులు తులసిని బతకనిస్తాయా? పీక్కుతినవూ?

ఏమిటీ పిచ్చి ఆలోచన? తులసి ఎవరో? తానెవరో? పరిచయమ్మై పట్టుమని పది నిమిషాలైనా కాలేదు. ఏవేవో ఊహించుకుంటున్న నేను కలవరపాటు పడి తేరుకున్నాను.

తులసి నన్ను గౌరవించేది. కానీ... నాలో తులసి పట్ల అభిమానం... ఆప్యాయతగాను.. ప్రేమగానూ రూపుదిద్దుకోసాగింది.

తులసి వంటి పిల్ల తన జీవిత భాగస్వామి కావాలి. నో? తులసే నాక్కాబోయే భార్యగా ఊహించుకుంటూ కలలు కనటం... క్రమేపీ ఆమెకి దగ్గరవటం జరిగింది.

తులసి నేను దగ్గరయ్యాం. మాది విడదీయరాని బంధమైంది.

అందుకే... పెళ్లి ప్రస్తావన ఇంట్లో తెచ్చినప్పుడల్లా ఏదో కారణంతో వాయిదా వేస్తూ వచ్చాను.

తులసి నన్ను నమ్మింది. నేను తులసిని మోసగించలేను. జన్మజన్మలకీ తులసే నా జీవిత భాగస్వామిగా భావించాను.

❁ ❁ ❁

తులసి మగపిల్లవాడి తల్లి అయిందని రాజయ్య చెప్పిన క్షణం నుంచీ కొడుకుని చూద్దామనే ఆపేక్ష నాలో పరుగులు తీస్తోంది.

నా కొడుకు ఇరవైయ్యేళ్ళ వాడై ఉంటాడు. వాడెవరి పోలికో? పిల్లవాడిని చదివించిందో లేదో?

తులసి పోలిక వస్తేనే మంచిది. ఆమె అందగత్తె కదా! పైగా తల్లి పోలిక మగపిల్లవాడికి వస్తే ఎంతో అదృష్టవంతుడవుతాడంటారు.

కొడుకు పేరేమిటో? అతని పుట్టుకకు నేను కారణమని తెలిస్తే... అసహ్యించుకుంటాడా? అభిమానిస్తాడా? తండ్రిగా నన్ను గౌరవిస్తాడా?

తులసికి నేను చాలా అన్యాయం చేశాను. మెడలో పసుపుకొమ్ము అయితే కట్టాను గానీ... ఈ సమాజానికి ఆమె నా భార్య అని చెప్పుకోలేక పోయిన బుద్ధిహీనుడ్ని.

ఇన్నేళ్ల తర్వాత నన్ను చూసేక తులసి అంతరంగం ఎలా ఉంటుందో? వెనకటిలా నన్ను అభిమానిస్తుందా? గౌరవిస్తుందా? ప్రేమిస్తుందా?

అన్నీ ప్రశ్నలే! ఏ ఒక్కదానికి జవాబు నా వద్ద లేదు.

తులసికి నేను అన్యాయం చేయలేదని నా అంతరాత్మ ఘోషిస్తోంది. ఆమెనే తల్చుకుంటూ... ఎండిన మోడులా ఉండిపోయాను. నా సుఖం నేను చూసుకునే స్వార్థ పరుడిని కాలేకపోయాను.

నేను ఎలాంటి వాడినో తులసికి బాగా తెలుసు. తులసి హృదయం నేను ఎరుగనిది కాదు. నన్ను పిచ్చిగా ప్రేమించింది. ఆరాధించింది.

అలాంటి తులసి నన్ను అపార్థం చేసుకుంటుందా? ఎందుకు చేసుకోదు? ఇన్నేళ్లలో నేను మళ్ళీ ఆమె ముఖం



అన్నీ ప్రశ్నలే! ఏ వొక్కదానికి జవాబు నా వద్ద లేదు. తులసికి నేను అన్యాయం చేయలేదని నా అంతరాత్మ ఘోషిస్తోంది. ఆమెనే తల్చుకుంటూ... ఎండిన మోడులా ఉండిపోయాను. నా సుఖం నేను చూసుకునే స్వార్థ పరుడిని కాలేకపోయాను.

చూడలేదు. ఆమె బాగోగులు గురించి ఆలోచించలేదు. ఆమె బతికి ఉన్నదో లేదో కూడా పట్టించుకోలేదు.

అలాంటి నన్ను... నా తప్పుని క్షమిస్తుందా?

అయినా తులసికి కేన్సరేమిటి? ఆ విషయం రాజయ్యనోట విన్నప్పటి నుండి నా గుండె కొట్టుకోవటం మానేసినట్టు ఫీలవుతున్నాను.

తులసి వంటి అభాగ్యురాలికి భయంకరమైన అనారోగ్యమేమిటి? నేను దూరం కావటం మూలాన తనను తాను అశ్రద్ధ చేసుకుని రోగగ్రస్తురాలైందన్న మాట.

ఏది ఏమైనా... తులసిని ఓదార్చాలి. ఆమెను సేదదీర్చాలి. ఎంత ఖర్చయినా సరే తనకు సరైన వైద్యం చేయించి బతికించుకోవాలి.

ఆఫీసులో ఫైళ్ల మీద సంతకాలు పెడుతున్నా... వచ్చిపోయే వారితో సంభాషిస్తున్నా... నా మనసంతా తులసిని ఎప్పుడెప్పుడు చూడటమానే ఆలోచన నన్ను కలచివేస్తోంది.

నేను తులసి నా కొడుకు అంతా కలిసి ఉండాలి. ఒకరికొకరమై ఇకనైనా జీవించాలి.

తన తప్పు క్షమించమని తులసిని వేడుకోవాలి. కాదు.. ఆమె పాదాల మీద వాలిపోవాలి. కొడుకుని ఆప్యాయానురాగాలతో కౌగిట చేర్చుకుని తృప్తిపడే క్షణం కోసం నా మనసు ఆరాట పడుతోంది.

❁ ❁ ❁

ఆఫీసు జీపులో వెడితే విషయం డ్రైవర్ ద్వారా అందరికీ తెలిసిపోవచ్చనే ఆలోచనతో నేను, రాజయ్య తులసిని చూడటానికి ఆటో ఎక్కాం.

వెడుతూ రాజయ్య నేను ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం.

ఒక పెంకుటింటి ముందు ఆటో ఆపమన్నాడు రాజయ్య. ఆగిన ఆటోలోంచి ఇద్దరం దిగేం. ముందు రాజయ్య వెనుకగా నేనూ లోపలికి నడిచాం.

సూర్యాస్తమయం వేళ కావటంతో ఇంట్లో వెలుగు తక్కువగా ఉంది.

గదిలో మంచం మీద పడుకున్న తులసిని సమీపించి 'చెల్లాయ్... ఎవరొచ్చారో చూడు' అన్నాడు నవారు మంచాన్ని సమీపించిన రాజయ్య.

వెనకనే వున్న నన్ను గుర్తించిన తులసి 'సారూ... బావున్నారా?' అంటూ పలకరించింది. తులసిలో దుఃఖం పెల్లుబికింది.

రాజయ్య వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

మంచం పట్టె మీద కూర్చుని తులసి తల నిమిరాను. వెనకటి తులసిలా లేదు. అందమంతా మాయమైంది. మాయరోగం ముంచుకు రావటంతో చావుకళ అవుపిస్తున్న తులసిని చూడగానే నా గుండె తరుక్కుపోయింది.

'ఎలా వుండేదానివి ఎలా అయినావ్ తులసీ' నా గొంతులో బాధ పెల్లుబికింది.

'మన బాబు ఇప్పుడు మీ ఆఫీసులోనే గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. నేను కొలువు మానేసి చాలా ఏళ్లయింది. నాకు కేన్సరట... నేను బతకను సారూ... కన్ను మూసేలోపు మిమ్మల్ని చూశాను. అంతే చాలు...' రొప్పుతూ ఆయాసపడుతూ మాట్లాడింది.

'ఏడీ? ఎక్కడ మన బాబు? ఒక్కసారి ఈ కళ్లతో చూచి తృప్తి పడాలని ఉంది'

'వాడు అచ్చంగా మీ పోలికే! మీకు మల్లే పెద్ద చదువు చదివాడు.' అని చెప్తూ నా వెనకగా నిలబడిన కొడుకునుద్దేశించి 'శంకరం... ఈసారేరా నీ తండ్రి' అంది.

నేనే వెనక్కి మళ్లి ఓ కుర్రాణ్ని చూశాను. అంతా నా పోలికే. నేను పాతికేళ్ల క్రితం ఎలా ఉండేవాడినో... అచ్చు శంకరం అదే నా కొడుకు అలాగే ఉన్నాడు.

మళ్లీ తులసి వేపు తిరిగిన నేను మంచం మీద వాలిపోయిన తులసిని చూసి భయపడ్డాను. ఆమె చేతులు శరీరం వేడి కోల్పోయి చల్లబడినట్టన్పించింది.

అందరం తిరిగి కల్సుకోగలిగామనే ఆనందంలో తులసి గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. ఆమె శ్వాస అనంత వాయువుల్లో కల్సిపోయింది.

నాలో దుఃఖం కట్టలు తెంచుకుంది.

శంకరం బావురుమన్నాడు. తల్లి శవం మీద పడి వలవలా ఏడ్చాడు.

'నీ చావు చూడటానికా తులసీ నేను ఈ ఊరొచ్చింది...' అంటూ మూగ బాధతో రోదించాను. ★

రచయిత చిరునామా:
ఎస్.వివేకానంద
రూం నెం.3
హోమ్ ఫర్ ది ఏజ్డ్, డోర్ నెం.1-28
గణేశ్‌నగర్ కాలనీ,
కుంట్లూరు - 501 505.
హాయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా.